


# ఎదుర్గాలి

ఎస్. పురుషోత్తమాచార్య

ఉదయం తొమ్మిది కావస్తోంది. నడుస్తూన్న ఆదాయంపన్నుశాఖ అధికారి రాజారావుగారు తలెత్తారు ఎదురుగా వస్తూన్న ఆ యువకుడు కాస్తా ఆయన్ని దాటి వెళ్ళిపోయేడు.

ఇలా ప్రతిరోజూ జరుగుతోంది.

రాజారావుగారింటి పక్కనే ఓ వీధి దీపస్తంభం ఉంది. ఆయన రోజూ అక్కడికి చేరుకోవటంతోనే ఎదురుగుండావచ్చి ఆ యువకుడాయన్ని దాటి వెళ్ళటం రివాజుగా జరుగుతోంది. దాన్ని మాత్రం కేవలం కాకతాళీయంగా పరిగణించలేకపోతున్నారాయన.

రోజూ సరిగ్గా తొమ్మిదికల్లా గడపని దాటి నడకని ప్రారంభిస్తారు రాజారావుగారు. ఆఫీసు జీపున్నప్పటికీ వ్యాయామం దృష్టితో ఆఫీసుకు నడచి వెళ్ళటం ఈ మధ్యనే ప్రారంభించేరాయన.

అందుకు ప్రతిరోజూ ఎదురవుతూన్న ఆ యువకునిపై అసంకల్పితంగానే ఆసక్తిని పెంచుకోసాగేరు రాజారావు

గారు. ఆ వ్యక్తి తమకు ఉద్దేశపూర్వకంగానే ఎదురవుతున్నాడేమోనని ఒకటి రెండుసార్లు అనుమానం కలిగినప్పటికీ ఆ అవసరం అతని కేందుకుంటుంది లెద్దూ! అంటూ సమాధానపడ్డారాయన. కాని మనస్సు వుండబట్టలేక ఓ రెండు రోజులు వరుసగా కావాలనే ఆలస్యం చేస్తూ కిటికీలోంచి ఆ యువకుణ్ణి గమనించేరాయన. ఆ యువకుడు మాత్రం యధావిధిగా ఆ సమయంలోనే ఆ వీధి దీపస్తంభాన్ని దాటి వెళ్ళిపోయేడు. కాని ఆ రెండురోజుల తర్వాత మళ్ళీ రాజారావుగా రెదురయేసరికల్లా ఆ యువకుని కళ్ళలో ఏదో వెలుగు!

ఏదో సబ్బుబిళ్ళల కంపెనీ ఏజెంటులాగ తెల్లని దుస్తులు ధరించివచ్చే ఆ యువకుని వదనసంమాత్రం దైన్యంతో వలినంగా వుంటుంది. అలసటా, ఆవేదనల బరువు అధికంగా వున్నవాడిలా భారంగా అడుగేస్తాడతను. గుండెల కదుముకున్న జిప్‌బ్యాగ్‌లో లక్షలున్నవాడిలా జాగ్రత్త వహిస్తూవుండం కొట్టవచ్చినట్లుగా కన్పిస్తూంటూంది.

రోజురోజుకూ రాజారావుగారిలో ఆ యువకునిపై ఆసక్తి పెరిగిపోతోంది. కాని అపరిచితుణ్ణి అకారణంగా పలకరించట వెలాగో తెలియకుండా వుందాయనకి.

ఓరోజు ఏదో ప్రయివేటు కంపెనీ వారి ఆదాయవ్యవహారాల్ని ఆకస్మికంగా తణిఖీచేయవలసి వచ్చింది రాజారావుగారు. ఆయన ఆ కంపెనీ ఆవరణలో జీపు దిగుతూనే 'విజిటర్స్ లాంజ్'లో కూచునివున్న కొందరు యువకుల్లో తమకు ప్రతిరోజూ తారసపడుతోన్న ఆ యువకుడుకూడా వుంటంచూచి ఆశ్చర్యంతో లోనికెళ్ళాడు.

రాజారావుగారిని సాదరంగా ఆహ్వానించేరు మేనేజరుగారు.

"వెలుపల ఆ జనం ఏమిటండీ!" ప్రశ్నిస్తూ కూర్చున్నారు రాజారావుగారు.

"మాకో స్టెనోగ్రాఫర్ అవసరంకాగా ఇంటర్వ్యూకి పిలిచేమండీ!" సవినయంగా సమాధానం ఇచ్చేరు మేనేజరుగారు.

"ఓ ఐసీ! ప్లీజ్ ప్రొసీడ్ విత్ యువర్ ఇంటర్వ్యూ! కాని ముందు మీ అకవుంటెంటుని పిలిపించండి!" అన్నారు రాజారావుగారు.

"అలాగేనండి! మీ పని పూర్తయ్యేకే వాళ్ళని పిలుస్తానండీ...." అంటూ ఏదో చెప్పబోయేరు మేనేజరుగారు.

"అబ్బెబ్బే! నా గురించి ఆ కుర్రాళ్ళని ఆపటవేవిటండీ? మీరోపక్కన కానియ్యండి! ఈ పక్కన నేనూ మీ అకౌంటెంటుగారూ మా తంటాలు మేం పడతాం!" అంటూ కాగితాల్లోకి తలని వంచేరు రాజారావుగారు.

గంట గడిచింది. తమ తనిఖీ చివరి అంకంలోకి చేరనున్న దశలో కంపెనీవాళ్ళందించిన కాఫీని సేవిస్తూ యదాలా

పంగా యింటర్వ్యూ చేయబడుతున్న వ్యక్తివంక చూసేరు రాజారావుగారు.

ఆ యువకుడే అతను! అతన్ని చూస్తూనే రాజారావుగారిలో ఏదో కదలిక ప్రారంభమయింది. వదనం నిండా దైన్యంతో నిరుత్సాహంగా అడుగులు వేస్తూ తమకు రోజూ ఎదురవుతూ వచ్చే ఆ వ్యక్తిలోని నిర్వీర్యత్వానికి నిరుద్యోగపు నిస్సహాయతే కారణవన్నమాట! అనుకున్నారు రాజారావుగారు. చూపుని మరలిస్తూ తమముందున్న కాయితాల్లోకి తొంగిచూడబోయే రాయన. అంతలోనే మేనేజరుగారి కంఠస్వరం గంభీరంగా వినిపించింది.

"చూడండి మిస్టర్ కృష్ణమూర్తీ! మీ స్పీడు మెరుగ్గానే ఉన్నప్పటికినీ మాకు కావలసింది హైయ్యర్ పాసయిన వ్యక్తి! అందువల్ల మీరీ యింటర్వ్యూకి శ్రమతీసుకుని మరీ వచ్చినందుకు మా ధన్యవాదాల్ని తెలుపుతున్నాను. మీ రిక వెళ్ళొచ్చు!"

"అలా అనకండి సార్! మరో వారంలో నా హైయ్యర్ రిజల్ట్సు వస్తాయి. ఫస్ట్‌క్లాస్ వస్తుందన్న నమ్మకం నాకుంది. నే నో పెద్ద కుటుంబానికి ఆశాదీపాన్ని! నాకీ అవకాశం యిప్పించండి సార్! ప్లీజ్!"

"దీనంగా మేనేజర్ని వేడుకొంటూన్న కృష్ణమూర్తివంక చూసేరు రాజారావుగారు.

"వెరీ సారీ మిస్టర్ మూర్తీ!" అంటూ ఆ యువకుని సర్టిఫికెట్లని ముందుకు తోసేరు మేనేజరుగారు


గాఢంగా నిట్టూరుస్తూ ఆ కాగితాల్ని తన జిప్‌బ్యాగ్‌లో భద్రపరుచుకుంటూ బరువుగా నడిచివెళుతున్న కృష్ణమూర్తిని చూస్తూనే రాజారావుగారిలో మళ్ళీ కదలిక ప్రారంభమయింది. అతని గురించి మేనేజర్‌గారికి చెబుదామనే ఉద్దేశంతో "చూడండీ!" అంటూ ఆయనవంక చూసేరు రాజారావుగారు.

కాని రాజారావుగారికి నోటమాట వెలికిరాలేదు. ఒకవేళ ఆ కుర్రవాడెవరని మేనాజరుగారడిగేపక్షంలో ఏం చెప్పాలో తెలిసిరాలేదాయనకి. ఆలోచనలో మునిగిపోయే డతను.

"ఎనీ కామెంట్స్ సర్!" కంగారుగా ప్రశ్నిస్తూన్న మేనేజర్‌గారి కళ్ళల్లోకి చూడలేక "నో నథింగ్!" అంటూ లేచి నుంచున్నారాయన.

జీపులో వెడుతూ ఫుట్‌పాత్ పైన దీనంగా నడుస్తూన్న కృష్ణమూర్తిని చూస్తూనే రాజారావుగారి మనస్సు కాస్త వికలమైపోయింది

మర్నాడు యథావిధిగానే తొమ్మిదింటికి వీధిలో ఎదురయిన కృష్ణమూర్తివంక చూడలేక యిబ్బందిగా తప్పుకున్నారు రాజారావుగారు. అతనికోసం తాను రాత్రంతా లోనయిన మనోవేదన కాస్త మళ్ళీ వారి వెన్నుని తట్టింది.




తామొకమాట చెప్పివుంటే కృష్ణమూర్తి వివరాల్ని తమనుంచి తెలుసుకునే ధైర్యం ఆ మేనేజరుగారి కుండేది కాదనే విషయం తర్వాత మాత్రమే తెలిసి వచ్చిందాయనకి. ఆ క్షణంలో తాముకృష్ణమూర్తికి సహాయం చేయగలిగి వుండీ కూడా చేయలేకపోయాననే విచారం వారిని ఆవరించింది.

ఆ యిరకాట పరిస్థితిని తప్పించుకునే ఉద్దేశ్యంతో తాము మర్నాటినుంచి ఆఫీసుకు బయలుదేరే వేళని మార్చుకున్నారు రాజారావుగారు. అయితే ఆ మర్నాడు కూడా తాము, ఆ బయల్దేరాలనుకున్న వేళకే దూరంనుంచి వస్తూ కనిపించిన కృష్ణమూర్తిని చూస్తూనే విస్తుపోయేరాయన. ఆ తర్వాతకూడా తాము ఏ సమయంలో బయలుదేరినా, అతను కాస్త దూరంనుంచి వస్తూ కనిపిస్తూంటం రాజారావుగారిని విస్మయంలో ముంచివేసింది. దీన్ని కాకతాళీయంగా ఎలా అన్వయించుకోవటం? ఈ మహానగరంలో ఈ కృష్ణమూర్తెవరు? తమ నెందుకిలా ఆశ్చర్యపరుస్తున్నాడు? అన్న ప్రశ్నలకు మాత్రం వారికి సమాధానం రాకుండా పోయింది.

ఓ రోజు ఎక్సైజు డిపార్ట్‌మెంటులో కన్పించేడు కృష్ణమూర్తి. అక్కడికొక్కడా అతను ఉద్యోగం కోసవే వచ్చినట్లుంది. ఎక్సైజు సూపరిండెంటు రెడ్డి తనకు క్లాసుమేటూ, ఆప్తమిత్రుడూ కావటంతో కృష్ణమూర్తి విషయంలో రాజారావుగారిని మళ్ళీ బలహీనత ఆవరించిందా క్షణంలో.

"ఒరేయ్ రెడ్డీ! నీకు స్టెనోగా అదో ఆ చెట్టుక్రింద నుంచున్నాడే! అతన్ని వేసుకోరా!" కిటికీలోంచి కృష్ణమూర్తిని

రెడ్డిగారికి చూపుతూ పలికేరు రాజారావు గారు.

ఆయనవంక అదోలా చూచేరు రెడ్డిగారు.

"ఏవిటి కథ? ఎవరతను?" సూటిగా అడిగేరు రెడ్డిగారు.

ఆ ప్రశ్నకి ఏం సమాధానంచెప్పాలో రాజారావుగారికి తోచలేదు. కాని తమ బలహీనత అతనకి తెలీనీకుండా "ఏదోరా! చూస్తే మంచికుర్రాడిలా వున్నాడు!" అంటూ దాటవేసేరాయన.

"ఒరేయ్ రాజూ! నీ మతి గతి తప్పి నట్లుంది. దారేబోయే దానయ్యలందరికీ నీ అడ్రసుయిస్తే సరిపోయేలా వుంది" అంటూ రెడ్డిగారు తమనలా తేలిగ్గా కొట్టి పారేస్తూంటే చూస్తూఊరుకున్నారాయన.

ఆ రాత్రి రాజారావుగారికి నిద్రపట్ట లేదు. తమ అసమర్థతపై రోతపుట్టుకు వచ్చింది. ఓ ప్రక్కన తమను అనవస రంగా మనస్సంక్షోభానికి గురిచేస్తూన్న కృష్ణమూర్తిపై విసుగు జనిస్తున్నాకూడా మరోప్రక్క మాత్రం తమపరాజయాన్ని అంగీకరించలేకపోతున్నారాయన. అందు చేత తీవ్రంగా ఆలోచించి ఓ నిర్ణయాని కొచ్చేరాయన.

రాజారావుగారి ఆ నిర్ణయం కార్య రూపం ధరించటానికి వారికి సేల్స్‌టాక్స్ ఆఫీసర్ భవానీశంకరం అవసరం ఏర్ప డింది. అతని ఆఫీసులోని స్టెనో ఉద్యో గానికి అభ్యర్థిగా కృష్ణమూర్తి తప్పక వస్తాడనే ధైర్యంతో బయలుదేరి వెళ్ళే రాయన. తాము ఊహించినట్లుగానే కృష్ణమూర్తి అక్కడ సిద్ధంగా వుంటం, పైగా అతని కళ్ళలో తమని చూడగానే ఓ ఆశాదీపం వెలగటాన్నీ గమనించేరు రాజారావుగారు.

"చూడు శంకరం! నే వచ్చిన పనే మీతో ముందుగానే చెప్పటం మంచిది! వెలుపల వున్న కుర్రాళ్ళలో కృష్ణమూర్తి అనే ఓ అబ్బాయి వున్నాడు. అతన్ని నీ స్టెనోగా వేసుకుంటే సంతోషిస్తాను." మళ్ళీ తమ మనసెక్కడ దారితప్పు తుందోనన్న భయంతో వల్లెవేసినట్లుగా ఏకబిగిన పలికి లేచునిపోయేరు రాజా రావుగారు.

"దీనిగ్గాను మీరింత దూరం రావాలా సార్? ఫోన్‌చేస్తే సరిపోయేదిగా!" అంటూ కాఫీకప్పు నందిస్తూ పలికేడు భవానీశంకరం.

ఆ రాత్రి నిశ్చింతగా నిద్రించేరు రాజారావుగారు.

—కాని మర్నాటి ఉదయం కొస్తా యధాప్రకారంగానే కృష్ణమూర్తి దీన వదనం ఎదురయేసరికల్లా రాజారావుగారి కెటూ పాలుపోలేదు. ఆ స్థితిలో తొలి సారిగా కృష్ణమూర్తిని పలకరించా రాయన.

"బాబూ! నిన్న నీకు ఉద్యోగం దొరికిందనుకుంటాను" సందిగ్ధంగా పలు



కుతూ కృష్ణమూర్తికళ్ళలో అశ్రువుల్ని చూసి కంగారుపడ్డారు రాజారావుగారు.

"సార్! మీరు పరోక్షంగా సహకరించేరని నిన్ననే తెలిసింది. కాని నేను దురదృష్టవంతుణ్ణి! నాకన్నాముందు లోనికెళ్ళిన మరో కృష్ణమూర్తిని సెలెక్ట్ చేసుకున్నారు వాళ్ళు!" అంటూన్న కృష్ణమూర్తి పలుకుల్ని వింటూనే నిర్విణ్ణులయ్యేరు రాజారావుగారు.

"నో! అలా జరగటానికి వీలులేదు! నే నిపుడే భవానీశంకరానికి ఫోన్ చేస్తాను!" అంటూ వెనుదిరగబోయే రాయన. కాని కృష్ణమూర్తి ఆయన్ని వారించేడు.

"క్షమించండి సార్! మరో వ్యక్తి నోటిముందు కూటిని కొల్లగొట్టినట్లవుతుంది. అతనూ నాలాంటి అభాగ్యుడే కావచ్చును. మీ సహాయాన్ని అప్రయంగానే పొందగలిగిన అదృష్టవంతుడతను. ఈసారికి పోనీండి!" అంటూ చేతులు జోడిస్తూన్న కృష్ణమూర్తివంక చూడలేక పోయేరు రాజారావుగారు.

కృష్ణమూర్తిని భవానీశంకరానికి చూపకుండా మళ్ళీ తప్పటడుగు వేసిన తమ అవివేకాన్ని నిందించుకోని క్షణం లేదు రాజారావుగారికి. ఆ వైఫల్యంతో కృష్ణమూర్తికి తమ మొహం చూపలేక మర్నాటినుంచీ ఆఫీసుకు జీపులోవెళ్ళటం

ప్రారంభిచేరాయన. ఆ రకంగా తాము అతన్ని తప్పించుకో గలుగుతున్నావని వాడు భావించినప్పటికినీ, ఆ కృష్ణమూర్తే తనని తప్పించుకోవాలని చూస్తున్నాడన్న సంగతి రాజారావుకి తెలియదు.

కాలగమనంలో కృష్ణమూర్తి ప్రసక్తిని మరిచిపోయేరు రాజారావుగారు. కాని హఠాత్తుగా తన ఆఫీసులోనే ఓ స్టెనోపోస్టు ఖాళీ ఏర్పడేసరికి కృష్ణమూర్తి తప్పనిసరిగా జ్ఞాపకం వచ్చాడాయనకి. ఈ సారి నిర్ణయం తీసుకోవలసింది తామే కాబట్టి కృష్ణమూర్తిని ఈ తడవ తప్పకుండా ఉద్యోగస్థుణ్ణి చేయగలననే నమ్మకంతో నిశ్చింతగా వుండిపోయేరాయన.

కాని యింటర్వ్యూ తేదీ దగ్గర పడుతుండగా రాజారావుగారిలో కంగారుచోటు చేసుకోసాగింది. ఎంప్లాయిమెంటు ఎక్చేంజినుంచి వచ్చిన అభ్యర్థుల పేర్లలో కృష్ణమూర్తి పేరు కనిపించలేదు. అపుడపుడు సప్లిమెంటరీ లిస్టులు రావటం జరుగుతూంటుంది. అతని పేరలా వస్తుందేమోననే ఉద్దేశంతో చివరిరోజు దాకా చూచేరాయన. అయితే అలాంటి దేవీ జరక్కపోవటంతో ఉండబట్టలేక ఎంప్లాయిమెంటు ఆఫీసుకి బయలుదేరాయన.

ఎంప్లాయిమెంటాఫీసర్‌గారు పరిచయస్థులే అవటంతో రాజారావుగారికిబ్బంది తప్పింది. రికార్డులు తిరగవేయించగా కృష్ణమూర్తి తన కార్డుని రెన్యూ చేయించుకోలేదని తెలీటంతో చికాకుపడ్డారాయన. చేసేదేమీ లేక కృష్ణమూర్తి చిరునామాని నోటుచేసుకుని ఆఫీసరుగారి దగ్గర సెలవుపుచ్చుకున్నారాయన.

కృష్ణమూర్తి యిల్లు తమ జీపు చేరరాని ఊరువీధి చివరలో వుంటంతో అంతవరకూ నడవక తప్పిందికాదు రాజారావుగరు. అతి కష్టంతో ఇల్లిల్లూ వెదుకుతూ కృష్ణమూర్తి ఇంటిదాపులోనికి వచ్చేసరికల్లా ఓ గుంపు ఎదురయిందాయనకి.

ప్రక్కకి తొలగి వివరాలు తెలుసుకున్న రాజారావుగారికి అరికాళ్ళక్రింది నేలకాస్తా తొలిగినట్లయిపోయింది. కళ్ళ ముందు దాదాపుగా చీకట్లు కమ్ముకుంటూ వుండగా కృష్ణమూర్తింటి ప్రక్కనే వున్న వీధిదీపం స్థంభం నానుకున్నారాయన.

సజల నయనాలతో దృష్టి సారించిన వారికి నిరుద్యోగపు జీవితంతో విసిగెత్తి విరమించిన కృష్ణమూర్తి నిర్జీవకాయం కాస్తా నలుగురు వాహకుల భుజాలపైన ఎదురురావటం కనిపించింది.

ఆ దృశ్యాన్ని భరించలేక లేనిశక్తిని కూడగట్టుకుని తమ జీపువంక చరచరా నడిచేరు రాజారావుగారు.